ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 40.0
కనిష్ఠం 24.2
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
3
సోమవారం 17 జూన్ 2024

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.60 (122.6854)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.45 (2.60)	84.34	84.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	98.09 (0.628)	నిల్	1,844

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.168 | డ్రెస్ : రూ.260 | స్కిన్‌లెస్ : రూ.290

తొలకరి పలకరింపు, మోగిన బడి గంటతో రైతులు సాగుబాట, విద్యార్థులు బడిబాట పట్టారు. ఓ వైపు వానాకాలం సీజన్, మరో వైపు నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాగా, సాగు ఖర్చులు, పాఠశాలల ఫీజుల మోతకు తోడు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.
- కోదాడ, సూర్యాపేటటౌన్, మిర్యాలగూడ, భువనగిరి రూరల్



ధరల దడ

- తల్లిదండ్రులపై ఫీజుల మోత
- వ్యవసాయదారులపై ఎరువుల భారం
- మధ్యతరగతికి నిత్యావసరాల మంట
- ఆకాశాన్ని అంటుతున్న కూరగాయల ధర

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాగా, గత ఏడాది కంటే ఈ సారి పాఠశాలల ఫీజులు పెరిగాయి. గత ఏడాది విద్యా సంవత్సరం ఐదవ తరగతి విద్యార్థికి పాఠశాల ఫీజు, డొనేషన్, స్కూల్ బ్యాగ్, యూనిఫాం, కొత్త పుస్తకాలపై రూ.80వేల వరకు వ్యయం కాగా, ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25)లో రూ.96వేల వరకు ఖర్చు వస్తోంది. గత ఏడాది బస్తా యూరియా ధర రూ.56, డీఏపీ రూ.80 అదనంగా పెరిగింది. గత ఏడాదికంటే ఈ సంవత్సరం నిత్యావసర వస్తువుల ధరలు 20శాతం మేర పెరిగాయి. గత ఏడాది కిలో బియ్యం ధర రూ.45 ఉంటే, ప్రస్తుతం రూ.60కి చేరింది. బియ్యంతోపాటు ఎండు మిర్చి, నూనె, మినప గుండ్లు, వెల్లుల్లి, అల్లం ధరల పెరుగుదలతో సుమారు రూ.3వేల నుంచి రూ.5వేలపైగా భారం పడుతోంది. జనవరిలో కిలో పచ్చి మిర్చి రూ.65ఉంటే, ప్రస్తుతం రూ.150 ఉంది. ఆకుకూరల కట్ట రూ.5ఉంటే, ప్రస్తుతం రూ.15కి పెరిగింది. నిమ్మకాయ ధర రూ.5పైగా ఉంది. దీంతో వచ్చే ఆదాయానికి చేసే వ్యయానికి పొంతన లేక సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

పెరుగుతున్న నిత్యావసరాల ధరలు

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు చిన్న, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రప్రభావం చూపుతోంది. బియ్యం, ఎండు మిర్చి, అల్లం, వెల్లుల్లి ధరలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. బీపీటీ బియ్యం ధర మొన్నటి వరకు రూ.45 ఉండగా, రూ.60కి పెరిగింది. ఎండుమిర్చి రూ.300పైమాటే. అల్లం జనవరిలో రూ.120 ఉంటే, జూన్ నాటికి రూ.160కి పెరిగింది. వెల్లుల్లి జనవరిలో రూ.160ఉంటే, ప్రస్తుతం చికెన్‌తో పోటీపడుతూ రూ.260కి చేరింది. నూనె, పంచదార, ఇడ్లీ రవ్వ, గోధుమ రవ్వ, శనగలు, కంది పప్పు, పెసర పప్పు, పచ్చి శనగ పప్పు, ఉల్లిగడ్డల ధర జనవరితో పోల్చితే 15 నుంచి 25శాతం పెరిగింది.



రైతులపై ఎరువుల భారం

ప్రస్తుతం వరి, కందులుతోపాటు పెసర, ఇతర విత్తనాల కొరత ఉండటం, బహిరంగ మార్కెట్‌లో వాటి ధరలు సైతం పెరిగాయి. మరో పక్క ఎరువుల ధరలను 10 నుంచి 20శాతం పెరిగాయి. గత ఏడాది యూరియా ధర రూ.280 ఉంటే ప్రస్తుతం రూ.336కి పెరిగింది. డీఏపీ బస్తా రూ.1,300 నుంచి రూ.1,380కి పెరిగింది. పురుగు మందుల ధరలు సైతం పెరిగాయి. వెరసీ ధరల పెరుగుదలపై అన్ని వర్గాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరలతోపాటు, ఫీజల నియంత్రణకు ప్రభుత్వం కృషిచేయాలని రైతులు, మధ్య తరగతి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు

కూరగాయలు సామాన్యుడు కొనేపరిస్థితి లేదు. ఏ కూరగాయ అయినా కిలో రూ.60 వరకు ఉంది. సూర్యాపేట మార్కెట్ ధర కంటే వీధి వ్యాపారులు రూ.10 నుంచి రూ.15 వరకు అదనంగా విక్రయిస్తున్నారు. టమాట మార్కెట్‌లో రూ.55 ఉండగా, తాజా పేరుతో రూ.65 వరకు విక్రయిస్తున్నారు. వీధివ్యాపారులు రూ.70కి పైగా విక్రయిస్తున్నారు. పేట వ్యవసాయ మార్కెట్‌లో కిలో పచ్చి మిర్చి రూ.110 నుంచి రూ.120 వరకు ఉంది. గత నెలరోజుల క్రితం వరకు పచ్చిమిర్చి కిలో రూ.70 ఉండగా, వారం రోజుల వ్యవధిలో రూ.110 నుంచి రూ.120వరకు ధర పలుకుతోంది. జిల్లాలో మిర్చిసాగు, టమాటా ప్రస్తుతం అంతగా లేకపోవడంతో మార్కెట్ వ్యాపారస్థులు ఏపీ రాష్ట్రం తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి టమాట దిగుమతి చేసుకుంటున్నారు. వానాకాలంతో పోల్చితే యాసంగిలో కూరగాయల సాగు తగ్గింది. నీటి లభ్యత మేరకు కూరగాయల సాగు ఉంటుంది. ఫలితంగా యాసంగిలో నాలుగోవంతు కూరగాయలు మాత్రమే సాగయ్యాయి. దీంతో దిగుబడి తగ్గి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కోదాడలో పచ్చిమిర్చి కిలో జనవరిలో రూ.65 ఉంటే ప్రస్తుతం రూ.150 వరకు ఉంది. చిక్కుడు, గోకర, ఆలుగడ్డ, క్యారెట్, దొండ, టమాట, బెండ, వంకాయ ధర జనవరిలో రూ.45 ఉంటే, ప్రస్తుతం రూ.65కి పైమాటే. రూ.10 ఇస్తే పచ్చిమిర్చి ఐదు కాయలు ఇచ్చే పరిస్థితి ఉందని మధ్యతరగతి మహిళలు వాపోతున్నారు. జిల్లాలో కూరగాయల సాగును ఎక్కువగా చివ్వెంల మండలంతో పాటు మద్దిరాల మండలం లోని కొన్ని తండాలు, తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లో చేస్తున్నారు. గత నెల విపరీతమైన ఎండలు కాయడంతో భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. బోరుబావి సౌకర్యం ఉన్న రైతుల మాత్రమే అక్కడక్కడ కూరగాయలు సాగు చేశారు. జిల్లాకు అవసరమైన కూరగాయల ఉత్పత్తి జరగకపోవడంతో ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో కూరగాయల తోటలకు రోజుకు రెండుసార్లు నీళ్లు పెట్టినా సరిపోవడం లేదు. దీంతో రైతులు కూరగాయల సాగును తగ్గించారు.



కూరగాయలు	ధర (కిలో)		
	సూర్యాపేట	భువనగిరి	మిర్యాలగూడ
పచ్చిమిర్చి	రూ.120	రూ.90	రూ.120
టమాట	రూ.55	రూ.54	రూ.60
కాకరకాయ	రూ.50	రూ.54	రూ.80
వంకాయ	రూ.30	రూ.30	రూ.40
బీరకాయ	రూ.50	రూ.50	రూ.100
క్యారేట్	రూ.50	రూ.46	రూ.50
దొండకాయ	రూ.50	రూ.40	రూ.50
ఆలుగడ్డ	రూ.50	రూ.40	రూ.50
ఉల్లిగడ్డ	రూ.30	రూ.40	రూ.50
చామగడ్డ	రూ.50	రూ.46	రూ.60
బెండకాయ	రూ.40	రూ.56	రూ.40
గోకరకాయ	రూ.60	రూ.60	రూ.60

● మిర్యాలగూడలో మొన్నటి వరకు ఉల్లి ధర రూ.100 ఉండగా, నిన్నటి వరకు పచ్చిమిర్చి ధర రూ.120 దాటగా నేడు, బీర, కాకార, దోసకాయలు ధరలు శతకం కొట్టాయి. జూన్ ఒకటి నుంచి నైరుతి ప్రభావంతో పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురవడంతో కాయగూరలు, ఆకు కూరల తోటలు దెబ్బతినడంతో దిగుబడి తగ్గి ధరలు పెరిగాయి. దీంతో కూరగాయల ధరలు పెరిగాయి. కిలో రూ.60కి అమ్మిన పచ్చి మిర్చి ధర ఏకంగా మే నెలలో రూ.120కి చేరింది. భారీ గాలి వానలకు తీగ జాతి తోటలు దెబ్బతినడంతో బీరకాయ, కాకర, దోస, దొండకాయ ధర అమాంతం పెరిగాయి. మిర్యాలగూడ మార్కెట్‌లో గత వారంలో కాకరకాయ రూ.60కి విక్రయించగా, ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100కు చేరింది. నాటు దోసయకాయలు రూ.50 నుంచి రూ.100కి పెరిగింది. రూ.20 నుంచి రూ.30 విక్రయించిన కిలో టమాటా ప్రస్తుతం రూ.60కి పెరిగింది. మే నెలలో కిలో రూ25 ఉన్న ఉల్లిపాయల ధర డబుల్ అయింది. ప్రస్తుతం ఉల్లి ధర రూ.50కి చేరింది. రూ.30 ఉన్న బెండకాయ రూ.40కి పెరిగింది. రూ.20కి విక్రయించిన వంకాయ ధర రూ.40కి పెరిగింది.

● భువనగిరి జిల్లా కేంద్రంలో రైతు బజారులో మొత్తం 128 స్టాల్స్ ద్వారా కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. సుమారు 18 క్వింటాళ్ల వివిధ రకాల కూరగాయలు రైతు బజారులో ప్రతి రోజూ విక్రయిస్తున్నారు. రైతు బజారులో సుమారు 2వేల మంది పైచిలుకు వినియోగదారులు కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. రైతు బజారులో బీన్స్ రూ.100, పచ్చిమిర్చి సన్నది కిలో రూ.70, లావు మిర్చి రూ.66, టమాట రూ.54 ధర పలుకుతున్నాయి.

చుక్కలు చూపిస్తున్న ధరలు



కూరగాయల ధరలు అధికంగా ఉండడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టమాట, సన్నమిర్చి, బీరకాయ తదితర కూరగాయల ధరలు అధికంగా ఉండడంతో కొనుగోలుచేయలేకపోతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూరగాయల ధరలు పేదలకు అందుబాటులో ఉండేలా అదుపు చేయాలి.
- టి.విజయలక్ష్మి, భువనగిరి

కూరగాయలు కొనుగోలుచేసే పరిస్థితి లేదు

కూరగాయలు కొనుగోలు చేయలంటే భయమేస్తోంది. ఏ కూరగాయ ధర అడిగినా రూ.50కు తక్కువ లేదు. పచ్చిమిర్చి కిలో రూ.120 అంటున్నారు. టమాట ధర రూ.60 వరకు ఉంది.
- పిల్లల రమేష్‌నాయుడు, సూర్యాపేట

ఏం కొనేట్టు లేదు



కూరగాయలు ధరలు అందుబాటులోకి రావడం లేదు. బియ్యం ధరలకు తోడు రోజూ ఏదో ఓ కూరగాయ ధర అమాంతం పెరుగుతూ పోతోంది. మొన్నటి వరకు కిలో రూ.40 ఉన్న బీరకాయ, కాకరకాయ ధర రూ.100కి పెరిగింది. టమాట, దొండకాయల ధరలు కూడ పెరిగాయి.
- లక్ష్మీతులసి, మిర్యాలగూడ

ఫీజుల భారం

ఇంగ్లీషు మీడియం చదువుపై తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ప్రైవేట్ పాఠశాలల యాజమన్యాలు ఏటా ఫీజులను భారీగా పెంచుతున్నాయి. గత విద్యా సంవత్సరం (2023-24)లో డొనేషన్, ఫీజు, యూనిఫాం రెండుజతలు, టై, బెల్ట్, బ్యాడ్జి, షూ రెండు జతలు, నోట్ బుక్స్, బ్యాగ్, లంచ్ బాక్స్, ఆటో చార్జీ మొత్తంగా సుమారు రూ.80వేల వరకు ఖర్చు వచ్చింది. ఈ ఏడాది ఫీజులతో పాటు, ఇతర వస్తువుల ధరలు 20శాతం పెరగడంతో విద్యార్థిపై సగటున అదనంగా రూ.16వేల భారం పడిందని తల్లిదండ్రులు వాపోతున్నారు.





జిల్లా కేంద్రంలో సామూహిక ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా

నేడు బక్రీద్

సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి

భువనగిరి టౌన్, జూన్16: త్యాగం, సేవాభావానికి ప్రతిరూపంగా ముస్లింలు నేడు జిల్లాలో బక్రీద్ పర్వదినాన్ని నిర్వహించనున్నారు. అందుకోసం జిల్లాలోని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. ప్రార్థనల అనంతరం కుర్బానీగోష్ అందించనున్నారు. సామూహిక ప్రార్థనల కోసం భువనగిరి పట్టణంతోపాటు జిల్లాలోని అన్ని ఈద్గాలో ఏర్పాట్లు పూర్తిచేశారు. మతపెద్దలు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయనున్నారు. మైదానాల్లో టెంట్లు, కార్పెట్లు, కుర్చీలు వేశారు. తాగునీరు తదితర వసతులు సమకూర్చారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. బక్రీద్ పర్వదినాన్ని శాంతియుతంగా, భక్తిభావంతో జరుపుకోవాలని పలువురు ప్రముఖులు సూచించారు. బక్రీద్‌ను పురస్కరించుకుని మేకలు, గొర్రెల విక్రయాలు పెరిగాయి. ఇతర ప్రాంతాల నుంచి తెప్పించిన జంతువులను స్థానికంగా విక్రయిస్తున్నారు. భువనగిరి మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు స్థానిక ఈద్గాలో ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ.రహీం, కౌన్సిలర్ ఎండీ.అజీమ్, మైనార్టీ నాయకులు ఉన్నారు. బక్రీద్ సందర్భంగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డీసీపీ ఎం.రాజేశ్‌చంద్ర, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వమే చేనేత
వస్త్రాలు కొనాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతికుమార్



మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతికుమార్

మోత్కూరు, జూన్ 16: వ్యవసాయం తర్వాత అతిపెద్ద వృత్తి చేనేత అని, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినట్లుగానే చేనేత కార్మికుల నుంచి చేనేత వస్త్రాలు ప్రభుత్వమే కొని మార్కెట్ చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో అవి నిర్వీర్యమైపోతున్నాయని, చేనేత వస్త్రాలు కొనేవారు లేక చేనేత కార్మికులకు పనిలేక కుటుంబ పోషణకు నానా అగచాట్లు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో రూ.300కోట్ల విలువైన చేనేత వస్త్రాలు నిల్వ ఉన్నాయన్నారు. చేనేత కార్మికులు వలసవెళ్లి హైదరాబాద్‌లాంటి నగరాల్లో అపార్ట్‌మెంట్ల వద్ద వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారన్నారు. మోదీ ప్రభుత్వం చేనేత పథకాలను రద్దు చేయడమే కాకుండా జీఎస్టీ విధించి చేనేత రంగాన్ని కుంగదీసిందని విమర్శించారు. టెక్స్‌టైల్ బోర్డును రద్దు చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో చేనేతకు ప్రత్యేక బడ్జెట్ ఇవ్వాలన్నారు.

చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించి, టెస్కోకు పాలకవర్గం ఏర్పాటుచేయాలని, చేనేత వస్త్ర నిల్వలు ప్రభుత్వంకొని, చేనేత కార్మికులకు పని కల్పించాలని, చేనేత సహకార సంఘాల క్యాష్, క్రెడిట్ రుణాలు మాఫీ చేయాలని, చేనేత వస్త్రాల ముడి సరుకులపై విధిస్తున్న జీఎస్టీని రద్దు చేయాలని, ప్రభుత్వ సిబ్బంది, ప్రభుత్వ, గురుకుల పాఠశాలల విద్యార్థులకు చేనేత వస్త్రాలు అందించాలని, చేనేత కార్మికులకు వర్క్‌షెడ్ కం హౌస్ నిర్మించి ఇవ్వాలని, ప్రతీ చేనేత కుటుంబానికి ప్రభుత్వం తక్కువ వడ్డీకి రూ.2లక్షలు ఇవ్వాలని, చేనేత రంగ అభివృద్ధికి యేటా రూ.2వేల కోట్ల నిధులు కేటాయించాలని, చేనేత కార్మికుల ఆరోగ్య రక్షణకు హెల్త్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్‌చేశారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పసునూరు యాదయ్య, లక్ష్మీ ఆయన వెంట ఉన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్

ప్రజా సంపదను దోపిడీ శక్తులకు
కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సుదర్శన్

భువనగిరి టౌన్, జూన్16: ప్రజా సంపదను కేంద్ర ప్రభుత్వం దోపిడీ శక్తులకు కట్టబెడుతున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. భువనగిరిలో జరుగుతున్న సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆదివారం ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా వెనుకబడిన తరగతుల జనగణనను చేపట్టడంలో బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పదేళ్లుగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రజాభీష్టం మేరకు పాలన చేయడం బీజేపీ అలవర్చుకోవాలన్నారు. మూడు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. నిరుద్యోగం పెరుగుతోందన్నారు. ప్రజల పక్షాన సీపీఎం నిరంతర పోరాటాలు చేస్తోందన్నారు. కార్మిక, పేద వర్గాలకు ఎర్రజెండానే అండగా ఉంటుందన్నారు. రెండు రోజులుగా సాగుతున్న శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్, నర్సిరెడ్డి, మల్లేశ్, పాండు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు నకిలీ నక్సలైట్ల ముఠా అరెస్టు

● తుపాకులతో ధనవంతులు, మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు బెదిరింపులు ● రోడ్లపై వాహనదారులను భయపెట్టి వసూళ్లు

నల్లగొండ, జూన్ 16: నలుగురు నకిలీ నక్సలైట్ల ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ చందన దీప్తి వివరాలు వెల్లడించారు. గత నెల 28వ తేదీన పీఏపల్లి మండలం ఘనపూర్ గ్రామ శివారులో ఉన్న పెద్దమ్మతల్లి గుడిని శుభ్రం చేయడానికి వెళ్లిన తోటకూరి పెద్ద వెంకటయ్యకు గుడిలో ఒక మూలకు మూడు తుపాకులు కన్పించాయి. దీంతో ఆయన స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తుపాకులను స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా కొందరు ఇచ్చిన సాక్ష్యాలను బట్టి ఘనపురం గ్రామానికి చెందిన తోటకూరి శేఖర్ ఈ తుపాకులను దాచాడన్న అనుమానంతో అతడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అంగడీపేటలో ఆదివారం అదుపులోకి తీసుకొని విచారించారు. గతంలో అక్రమ తుపాకులు కలిగి ఉండడంతో శేఖర్‌పై హాలియా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై జైలుకు వెళ్లాడు. శేఖర్‌కు మిర్యాలగూడ జైలులో రమేష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. వారు జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత జీవితంలో తొందరగా స్థిరపడాలన్నా ఉద్దేశంతో రమేష్‌కు పరిచయం ఉన్న



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ చందన దీప్తి

మహబూబాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ కలిసి సూడో నక్సలైట్లుగా చెలామణి అవుతున్నారు. వీరంతా తుపాకులను ధరించి ధనవంతులను, మైనింగ్ వ్యాపారులను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించేవారు. అదేవిధంగా రోడ్డుపై వెళ్లే వాహనదారులను ఆపి తుపాకులను చూపించి బెదిరించి డబ్బు వసూలు చేసేవారు. విశాఖపట్నం దగ్గరలోని జీకేవీధి సాపర్లలో తుపాకులను కొనుగోలు చేశారు. ఈ తుపాకులను కొన్ని రోజులు శేఖర్ తన ఇంట్లోనే ఉంచుకుని ఎవరైనా చూస్తారన్నా భయంతో ఘనపురం గ్రామశివారులోని పెద్దమ్మతల్లి గుడిలో భద్రపర్చాడు. తుపాకులు పెద్దగా ఉన్నాయని భావించి పిస్టల్ లాంటి చిన్న తుపాకులు ఉంటే కనపడకుండా పట్టుకెళ్లొచ్చని పిస్టల్ అన్వేషణలో ఉండగా, శేఖర్ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడు ఇచ్చిన సమాచారంతో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మదిపల్లి గ్రామానికి చెందిన మాచర్ల శ్రీనివాస్‌ను, అదే గ్రామానికి చెందిన గుంటుక రమేష్‌ను, అదే జిల్లా కేసముద్రానికి చెందిన మారపాక లక్ష్మీనారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన దేవరకొండ డీఎస్పీ గిరిబాబు ఆధ్వర్యంలోని కొండమల్లేపల్లి సీఐ కె.ధనుంజయ, గుడిపల్లి ఎస్ఐ డి.నర్సింహులు, సిబ్బంది హేము నాయక్, సత్యనారాయణ, హట్టినాయక్, కొండల్, భాస్కర్, మహేష్, గురువారెడ్డి, లాలునాయక్ బృందాన్ని ఎస్పీ అభినందించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

» విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
» అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
» 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కౌశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

‘నాలా’ ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్‌ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్ఆర్ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్‌ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్ఆర్ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఏస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

\- ఎం.ప్రేమ్‌కుమార్,
వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై ‘చలో’ మొబిలిటీకి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

» టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టుల్లో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

» 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

» వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

ఆవులను తరలిస్తున్న వాహనాల పట్టివేత



కట్టంగూరులో పట్టుబడిన పశువుల వాహనం

కట్టంగూరు, జూన్ 16: అక్రమంగా తరలిస్తున్న ఆవుల వాహనాన్ని నల్లగొండ జిల్లా కట్టంగూరు పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ ఎన్.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 40ఆవులు, 20 ఎద్దులను మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో-65వ నెంబర్ జాతీయ రహదారిపై పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వాహన డ్రైవర్ వహీద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా విజయవాడలోని హనుమాన్ జంక్షన్‌లో పశువులను కొనుగోలు చేసి హైదరాబాద్‌లో కోసేందుకు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడని ఎస్ఐ తెలిపారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసి కంటైనర్‌లో వాహనంలో ఉన్న ఆవులను, ఎద్దులను స్థానిక గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కొండమల్లేపల్లిలో 12 ఆవుల పట్టివేత

కొండమల్లేపల్లి: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి చౌరస్తాలో ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా డీసీఎం వాహనంలో చెర్కుపల్లి సతీష్ 12ఆవులను డీసీఎంలో కట్టేసి కట్టేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పటుకున్నారు. కేసు నమోదు చేసి పశువులను చండూరులోని యుగతులసి గోశాలకు తరలించినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

కేతేపల్లి: గోవుల తరలింపును అడ్డుకునేందుకు 65వ నెంబర్ జాతీయ రహదారిపై కేతేపల్లి పోలీసులు తనిఖీలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. హైవే మీదుగా హైదరాబాద్‌కు గోవులను తరలించకుండా టోల్‌గేటు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద రెండు రోజులుగా పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే లారీలు, డీసీఎం, మినీ వ్యాన్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి వదులుతున్నారు. చెక్ పోస్టు సిబ్బంది పని తీరును కేతేపల్లి ఎస్ఐ ఎ.శివతేజ ఎప్పకప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నార్కట్‌పల్లి, జూన్ 16: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామశివారు భాగ్యనగర్ గ్రీన్‌సిటీ వెంచర్ వద్ద చెట్టు కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 45 నుంచి 50 సంవత్సరాలు కలిగి వ్యక్తి యాచకుడి ఆనవాళ్లు కలిగి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. చెర్వుగట్టు గ్రామపంచాయతీ కార్యదర్శి కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శాలిగౌరారం ప్రాజెక్టును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తాం



నీటిని విడుదల చేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, జూన్ 16: నిజాం కాలంలో నిర్మించిన వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన శాలిగౌరారం ప్రాజెక్టును రిజర్వాయర్‌గా మార్చి అభివృద్ధి చేస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గంగమ్మ తల్లికి వేద పండితులతో ఆదివారం పూజలు నిర్వహించి హారతులు ఇచ్చిన తర్వాత శాలిగౌరారం ప్రాజెక్టు నీటిని ఎంపీ, ఎమ్మెల్యే ఖరీఫ్ సీజన్‌కు కుడి, ఎడమ కాల్వల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలో తొమ్మిది గ్రామాలకు సాగు నీరు అందుతుందని దాదాపు 50 గ్రామాల్లో భూగర్భ జలమట్టం పెరుగుతుందని అన్నారు. గత సంవత్సరం ప్రాజెక్టు అభివృద్ధి పనులకు రూ.5కోట్లు నిధులు మంజూరు అయిన కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలి వేశాడని మిగిలిన పెండింగ్ పనులను ఐబీ అధికారులు తక్షణమే చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 30కిలోమీటర్లు ఉన్న ఫీడర్ ఛానల్‌ను పటిష్టంగా నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టుకు వాచ్‌మెన్‌లను నియమించేందుకు కలెక్టర్‌తో మాట్లాడుతామన్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని శాలిగౌరారం తీసుకొచ్చి శాలిగౌరారం ప్రాజెక్టును చూపించి రిజర్వాయర్‌గా మార్చి ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రాజెక్టులో పర్యాటకులు తిరిగేందుకు బోటులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఎర్ర రణీల యాదగిరి, ఎంపీటీసీలు జోగు సైదమ్మ శ్రీనివాస్, నోముల జనార్ధన్, సింగల్ విండో వైస్ చైర్మన్ సీఎం రెడ్డి, ఐబీ ఈఈ విజయ్‌కుమార్, డీఈ సత్యనారాయణ, ఏఈలు అమర్, రాములు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ మంత్రి నవీన్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్, చాడ సురేష్‌రెడ్డి, చామల వెంకటరమణారెడ్డి, నూక కిరణ్ కుమార్, పాదూరి శంకర్‌రెడ్డి, షేక్ ఇంతియాజ్ అహ్మద్, దండ అశోక్‌రెడ్డి, గోదల నరేందర్‌రెడ్డి, దేవేందర్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. ఆర్టీసీ బస్సు ఢీకొని బీటెక్ విద్యార్థి, డివైడర్‌ను ఢీకొని విద్యార్థి, బొలేరో వాహనం ఢీకొని మహిళ, కారు ఢీకొని మరో మహిళ, బైక్ అదుపు తప్పి వృద్ధుడు మృతిచెందారు.



ప్రమాదస్థలంలో సాయికుమార్ మృతదేహం, ఇన్‌సెట్లో సాయికుమార్ (ఫైల్‌ఫొటో)

భువనగిరి రూరల్, జూన్16: మోటారు సైకిలిస్టును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఓ బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈఘటన ఆదివారం సాయంత్రం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మునిసిపల్ పరిధిలోని రాయిగిరిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఇలా ఉన్నాయి.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమాన్‌కోటకు చెందిన మామిడి సాయికుమార్ (21) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్‌లోని కేపీఆర్‌ఐటీ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అయితే కళాశాలకు రెండు రోజులు సెలవురావడంతో స్వగ్రామమైన వర్ధమాన్‌కోటకు మోటారుసైకిల్‌పై వెళ్తుండగా మార్గంమధ్యలోని రాయిగిరి శివారులో తొర్రూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగద్గిరిగుట్ట వైపు వస్తూ ఎదురుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో సాయికుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. భువనగిరి రూరల్ ఎస్ఐ బి.సంతోష్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

భూదాన్‌పోచంపల్లి: మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు చింతల శ్రీశైలం కుమారుడు చింతల శ్రవణ్ (21) అనే యువకుడు హైదరాబాద్‌కు వెళ్లి బైక్‌పై తిరిగి వస్తున్న క్రమంలో ఆదివారం ఉదయం పెద్ద అంబర్‌పేట వద్ద డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలకు గురయ్యాడు. అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతదేహాన్ని గ్రామానికి తరలించారు.

బొలెరో వాహనం ఢీకొని..

వేములపల్లి: బొలెరో వాహనం ఢీకొని మహిళ మృతి చెందగా, చిన్నారికి గాయాలైన సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి అద్దంకి రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి ఎస్ఎస్‌పీ కాలనీకి చెందిన మల్లికంటి కళమ్మ(40) తన మనుమరాలైన కోమళ్ల ఐశును ఎత్తుకుని వేములపల్లి మండల కేంద్రానికి పనినిమిత్తం నడుచుకుంటూ వస్తోంది. ఈక్రమంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడెం వైపు వెళ్తున్న బొలెరో వాహనం అతివేతంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈసంఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కళమ్మ మృతి చెందగా ఐశును చికిత్స పొందుతోంది. ఈమేరకు కళమ్మ భర్త సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం కళమ్మ మృతదేహంతో కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ ప్రధాన రహదారిపై కాసేపు రాస్తారోకో చేయగా విషయం తెలుసుకున్న రూరల్ సీఐ వీరబాబు అక్కడ చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం కలిగేలా చూస్తామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు.

కారు ఢీకొని..

చివ్వెంల : సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఉండ్రుగొండ శివారులో కారు ఢీకొని మహిళ మృతి చెందింది. చివ్వెంల ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ జిల్లా కరప మండలం ఆరట్లకట్ట గ్రామానికి చెందిన రాయుడు అనంతలక్ష్మి(43), వెంకటరమణ దంపతులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. చివ్వెంల మండలం ఉండ్రుగొండ శివారులోని ఓహోటల్‌లో పనిచేస్తున్న హరీష్ వద్దకు హైదరాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ -విజయవాడ 65జాతీయ రహదారిపై ఉండ్రుగొండ శివారులో యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న కారు అతివేగంగా ద్విచక్రవాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనంతలక్ష్మికి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త వెంకటరమణకు తీవ్రంగా గాయపడగా, ఆయనను 108అంబులెన్సులో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. కుమారుడు హరీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వృద్ధుడు..

మఠంపల్లి : ద్విచక్ర వాహనం అదుపుతప్పి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని జాన్‌పహాడ్ రోడ్డులో ఆదివారం జరిగింది. మృతుడి బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన మోదుగు కృష్ణారెడ్డి(67) గ్రామశివారులో ఉన్న తన పొలానికి ద్విచక్ర వాహనంపై వెళుతూ జాన్‌పహాడ్ రోడ్డుల ప్రమాదవశాత్తు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణారెడ్డిని స్థానికులు 108అంబులెన్సులో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కృష్ణారెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

మద్దిరాల, జూన్ 16: వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాకడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మద్దిరాల గ్రామానికి చెందిన పెద్దూరి అశోక్ (43)కు లక్ష్మీప్రసన్నతో 20ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త వేధింపులు తట్టుకోలేక భార్య, కుమార్తెతో కలిసి సూర్యాపేటలో నివసిస్తోంది. కుమారుడితో కలిసి అశోక్ మద్దిరాలలో నివసిస్తున్నారు. భార్య కాపురానికి రాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి దూలానికి ఉరేసుకున్నాడు. అశోక్ కుమారుడు జశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో సబ్‌స్టేషన్ ఆపరేటర్ మృతి



నేరేడుచర్ల, జూన్ 16: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్లకు చెందిన మండవ నాగేశ్వరావు(40), మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి గ్రామ శివారులోని పాత విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తున్నారు. ఉదయం ఏడు గంటల సమయంలో కిందకు ఉన్న విద్యుత్ తీగలను సరిచేస్తుండగా ఈ తీగలు ప్రమాదవశాత్తు పైనుంచి వెళుతున్న 11కేవీ విద్యుత్ వైర్లకు తగిలాయి. విద్యుదాఘాతంతో నాగేశ్వరావు అక్కడికక్కడే మృతి చెందాడు. నాగేశ్వరావు గరిడేపల్లి మండలం గడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. నాగేశ్వరావు భార్య సుశీల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేరేడుచర్లలో ఇంట్లో చోరీ

● టీవీ సహా రూ.9లక్షల విలువైన సొత్తు అపహరణ



నేరేడుచర్లలో దొంగలు చిందరవందర చేసిన వస్తువులు

నేరేడుచర్ల, జూన్ 16: ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు పడి రూ.9లక్షల విలువైన సొత్తును దొంగలు చోరీ చేశారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలోని అయ్యప్పస్వామి గుడి వెనుక భాగంలో ఉన్న ఇంటిలో జరిగింది. నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం..నేరేడుచర్లలోని అయ్యప్పస్వామి గుడి వెనుక భాగంలో నివసిస్తున్న బుర్రి అప్పయ్య మఠంపల్లి మండలంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. అప్పయ్య తమ్ముడు బుర్రి వీరన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా వర్క్ ఫ్రం హోంగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిద్దరూ ఈనెల 12వ తేదీన ఇంటికి తాళం వేశారు. హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి అయ్యప్ప, కోదాడ సమీపంలోని అత్తగారి ఊరైన గణపవరం గ్రామానికి వీరన్న వెళ్లాడు. అప్పయ్య ఆదివారం నేరేడుచర్లకు రాగా, ఇంటి తాళం ధ్వంసం చేసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా, . రెండు బీరువాల్లోని వస్తువులు చిందరవందరంగా పడి ఉన్నాయి. అన్నదమ్ములకు చెందిన సుమారు రూ.9 లక్షలు విలువైన మూడు తులాల బంగారు గొలుసులు రెండు తులాలున్న రెండు బంగారు గొలుసులు, ఒక తులం బంగారం మాటీలు, అర కిలో వెండి పూజా సామగ్రి, రూ.50వేలుతో పాటు హాలులో ఉన్న టీవీని ఎత్తుకెళ్లారు. అప్పయ్య పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఆధారాలను క్లూస్ టీం సేకరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు.

వైభవంగా సీతారామచంద్ర స్వామి కల్యాణం


వలిగొండ: తాళిబొట్టు చూపుతున్న అర్చకులు


భువనగిరి: మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం


మోటకొండూర్: బొడ్రాయి వద్ద పూజలో పాల్గొన్న మాజీ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత

వలిగొండ, జూన్ 16: మండలంలోని చిత్తాపురం గ్రామంలో కొలువుదీరిన సీతారామచంద్రస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. 16వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణ వేడుకలను అర్చకులు జరిపించారు. దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పచ్చని మామిడి తోరణాలు కట్టి గర్భాలయానికి ఎదురుగా కల్యాణ మండపాన్ని తీర్చిదిద్దారు. స్వామిని అమ్మవారిని ముగ్ధ మనోహరంగా అలంకరించి, మండపంలో అధిష్ఠింప చేశారు. శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణ తంతును అర్చకులు జరిపారు. స్వామివారి కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. అశేష జనవాహిని తిలకిస్తుండగా శ్రీ సీతారామచంద్రస్వామి అమ్మవారి మెడలో మాంగళ్య ధారణ గావించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు.

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి

భువనగిరి రూరల్: ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని అలవర్చుకున్నట్లయితే సమాజంలో శాంతియుత వాతావరణం సుస్థిరంగా ఉంటుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో మల్లికార్జున స్వామి, రేణుక ఎల్లమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని గ్రామ దేవతలను వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, సుక్క స్వామి, ఎలిమినేటి కృష్ణారెడ్డి, రావి కిరణ్ రెడ్డి, సురేశ్ రెడ్డి, పాశం శివానంద్, వెంకటేశ్, సత్యనారాయణ, శేఖర్, రాములు, జంగయ్య తదితరులున్నారు.


ఉప్పలమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

మహాలక్ష్మి, భూలక్ష్మిసమేత దేవతలకు పూజలు

మోటకొండూర్ : మండల కేంద్రంలో మహాలక్ష్మి, భూలక్ష్మిసమేత బొడ్రాయి పండుగ సందర్భంగా ఆదివారం క్షేత్రశుద్ధి, ప్రోక్షణ, యాగశాల, నిర్మాణం నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ వడ్డెబోయిన శ్రీలత మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు పాడి పంటలు, సుఖసంతోషాలతో ఉండాలని బొడ్రాయి పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యమానికి ముఖ్య అథితులుగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి, బూడిద బిక్షమయ్యగౌడ్, పైళ్ల శేఖర్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి సన్నాహాలు

భువనగిరి టౌన్: గుర్తు తెలియని దుండగుల దాడిలో ధ్వంసమైన భువనగిరిలోని ఉప్పలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఆలయం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆలయ నిర్మాణం తీరుపై చర్చించి పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, వీహెచ్‌పీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కేమోజు మల్లికార్జున్, వేణు, నాయకులు పోలా శ్రీనివాస్ గుప్తా, సుర్వి శ్రీనివాస్ గౌడ్, పూస శ్రీనివాస్, రత్నపురం శ్రీశైలం, సూదగాని రాజు, నానంచర్ల శివ, యెదగాని సంతోష్ పాల్గొన్నారు.

రహదారికి అడ్డంగా కంపచెట్లు

● ఇబ్బందులు పడుతున్న వాహన దారులు


రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన కంప చెట్లు

భువనగిరి రూరల్, జూన్ 16: రహదారికి ఇరువైపులా ఏపుగా కంప చెట్లు పెరగడంతో రాకపోకలు కొనసాగిస్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భువనగిరి మండలం సిరివేణికుంట నుంచి నందనం వరకు ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం (పీఎంజీఎస్‌వై) కింద బీటీ రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరగడంతో మూల మలుపుల వద్ద వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపచెట్ల వేర్లు రోడ్డు పక్కకు పాతుకుపోవడంతో రహదారి ధ్వంసమవుతోందని ఇటీవల పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగించాలి.

కంపెట్లను తొలగించాలి



ఎన్నో సంవత్సరాల నుంచి తాము పోరాటం చేసి బీటీ రోడ్డును ఏర్పాటు చేసుకున్నాము. అయితే సిరివేణికుంట నుంచి నందనం వరకు సంవత్సరం క్రితం బీటీ రోడ్డును నిర్మించాలి అయితే రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరగడంతో వాహనదారకులు ప్రమాదాల భారీన పడడమే కాకుండా రోడ్డు ధ్వంసమవుతుంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని కంపచెట్లను తొలగించాల్సి ఉంది.

-పడాల అనిత, మాజీ సర్పంచ్, సిరివేణికుంట

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి అర్బన్, జూన్ 16: జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీలకు పొరుగు సేవల పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీంమెంబర్ సెక్రటరీ బి.శాంతిశ్రీ ఆదివారం తెలిపారు. ప్రభుత్వ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాలమేరకు అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులు ఈ నెల 18 నుంచి 22వరకు సాయంత్రం 5గంటల లోగా కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పనా అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, ఈ ఖాళీలకు గాను మెరిట్, అర్హతల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 44 ఏళ్ల పరిమితి కలిగి విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలు, కుల, నివాస ధ్రువపత్రాలతోపాటు ఆధార్ కార్డు, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు బోనాఫైడ్ సర్టిఫికెట్లు జతపర్చి అందజేయాలన్నారు. గతంలో ప్రజావాణి, టీం కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్నవారు కూడా తిరిగి దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

పోస్టుల వివరాలు

- 10 డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులు (ఏదైనా డిగ్రీ, గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి పీజీడీసీఏ ధ్రువపత్రం ఉండాలి)
- 4 డిసెక్షన్ హాల్ అటెండెంట్లు (10 తరగతి ఉత్తీర్ణత, అనాటమీ లేదా ఫోరెన్సిక్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ నందు ఒక సంవత్సరం అనుభవం ఉండాలి)
- 4 ల్యాబ్ అటెండెంట్లు (బీఎస్సీ ఎంఎల్‌టీ లేదా డీఎంఎల్‌టీ ఉత్తీర్ణత, పారా మెడికల్ బోర్డు నందు రిజిస్ట్రేషన్ ఉండాలి)
- 8 సబార్డినేట్ స్టాఫ్ (పదవ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలి)
- 2 రికార్డు అసిస్టెంట్లు (డిప్లమా ఇన్ మెడికల్ రికార్డు, మెడికల్ రికార్డు మెయింటెనెన్స్‌లో అనుభవం ఉండాలి)
- 4 థియేటర్ అసిస్టెంట్లు (పదవ తరగతి ఉత్తీర్ణత, గుర్తింపు పొందిన ఇన్‌స్ట్యూట్ నుంచి శిక్షణ ధ్రువపత్రం ఉండాలి.)

మోటారు పంపుసెట్ల కేబుల్ వైర్ల చోరీ

వలిగొండ, జూన్ 16: గుర్తుతెలియని దుండగులు వ్యవసాయ మోటార్ల పంపసెట్ల కేబుల్ వైర్‌ను అపహరించిన ఘటన శనివారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎదులగూడెం, ప్రొద్దుటూరు గ్రామాలకు చెందిన రైతులు గజ్జి బాలనరసింహ, లింగయ్య, గౌరయ్య, దాశ బోయిన శంకరయ్య, బుంగమట్ల నరసింహ, సత్తయ్యతోపాటు మరి కొంతమంది రైతులు కాలువలనుంచి వ్యవసాయం సాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వర్షాకాలం పంట నారుమళ్లు దున్నడం కంటే ఖాళీగా ఉండడంతో గుర్తుతెలియని దుండగులు రైతుల మోటారు పంపుసెట్ల కేబుల్ వైర్లు, ఒక ట్రాక్టర్ బ్యాటరీ అపహరించుకుని వెళ్లారు. ఒక్కో రైతుకు సుమారుగా 3వేల నుండి 5వేల వరకు నష్టం వాటిల్లింది. అలా మొత్తం 30 మంది రైతులకు పైగానే కేబుల్ వైరు చోరీ జరిగిందని బాధితులు తెలిపారు. సదరు బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్‌లో మట్టి ఖాళీ చేస్తుండగా..

రామన్నపేట, జూన్ 16: ట్రాక్టర్ ట్రాలీ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని దుబ్బాక గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుబ్బాక గ్రామంలో ట్రాక్టర్ ట్రాలీలో మట్టిని ఖాళీ చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ డ్రైవర్ రౌతు సోమేశ్వర్‌రావు (67) తీవ్ర గాయాలకు గురి కాగా అక్కడే ఉన్న కొంత మంది ప్రజలు రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం నల్లగొండ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. సోమేశ్వర్‌రావుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

టీడీపీ పాదయాత్ర

భువనగిరి టౌన్, జూన్ 16: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో తెలుగుదేశం మరోమారు అధికారంలోకి రావడాన్ని హర్షిస్తూ ఇబ్రహీంపట్నం నుంచి యాదగిరిగుట్ట వరకు చేపట్టిన టీడీపీ పాదయాత్ర ఆదివారం భువనగిరికి చేరింది. జిల్లా ఆసుపత్రి ఎదురుగా ఉన్న మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణలోనూ త్వరలోనే టీడీపీకి పూర్వ వైభవం లభిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెల మని రవీందర్ అన్నారు. ముందుగా పట్టణ అధ్యక్షులు బచ్చు శ్రీనివాస్ గుప్తా, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు దూసరి చంద్రశేఖర్ గౌడ్, మాటూరి శ్రీనివాస్, సైదులు, ఆరెపల్లి రాము తదితర నాయకులు స్వాగతం పలికారు. అనంతరం పాదయాత్ర యాదగిరిగుట్ట వైపు వెళ్లింది.

హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 16: భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు ఉధృతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ రంగాలలో రిజర్వేషన్లు అమలు చేయడంలో ఎస్సీ సంక్షేమానికి నిధులు కేటాయింపు ఘననీయంగా తగ్గింపు చేస్తూ దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం జరగడం లేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో దళితులను చైతన్యం చేయడానికి ఈ నెల 18, 19, 20 తేదీల్లో గుట్టలో రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామని, ఈ శిబిరాలను ప్రారంభించడానికి ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, ఆరె పుష్ప పాల్గొన్నారు.

కాంగ్రెస్‌నుంచి ఆదినారాయణ సస్పెన్షన్

భువనగిరి రూరల్, జూన్ 16: భువనగిరి మండలం చందుపట్ల గ్రామానికి చెందిన డీసీసీ ఉపాధ్యక్షులు వల్లందాసు ఆదినారాయణను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఆదివారం ఓ ప్రకటన జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడని మండలంలోని చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి, గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టి పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు డీసీసీ అధ్యక్షులు సంజీవరెడ్డి పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఆత్మకూరు(ఎం), జూన్ 16: మండల కేంద్రంలో వనం సుగుణమ్మ అనే రోజు వారీ కూలీ ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. శివాజీ నగర్ వినాయక కమిటీ సభ్యులు ఆదివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5000 నగదు తోపాటు 25 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఎల్మినేటి మురళీకృష్ణ, పెరబోయిన మధు, రాచమల్ల ప్రసాద్, చెరకు శ్రీనివాస్, ఎలగందుల లక్ష్మణ్, తవిటి హరిబాబు, ఆరే శ్రీకాంత్, యాస మురళీ, బి.మహేష్, ఏ.రాజు, ఏమచ్చగిరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తుర్కపల్లి, జూన్ 16: తుర్కపల్లి మండల కేంద్రంలోని పడాల ముత్యాలు మెమోరియల్ హైస్కూల్ 2008-09 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఒకరినొకరు చిన్ననాటి జ్ఞాపకాలను ఒకరి నొకరు గుర్తు చేసుకున్నారు. ఎవరెవరు ఏఏ రంగాల్లో స్థిర పడ్డారో ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, శేఖర్, పూర్వ విద్యార్థులు ధనుంజయ్య, రవీందర్, మల్లేశ్, నవీన్, రమేశ్, రాజు, ఉద్దీప్, ధర్మేంద్ర, వెంకటేశ్, కవిత, అరుణ, అనీత, సునీత, పుష్ప తదిరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాజాపేట, జూన్ 16: రాజాపేట మండలంలోని సింగారం గ్రామానికి చెందిన కటికల తార(45) పాము కాటుకు గురై చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో ఈ నెల 14న పాము కాటుకు గురైంది. కాగా చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అహింసా మార్గమే ప్రపంచానికి మార్గదర్శనం

● మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు


సామూహికంగా ప్రతిజ్ఞ చేస్తున్న గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మహిళా ప్రతినిధులు

చౌటుప్పల్ టౌన్, జూన్ 16: గాంధీజీ అనుసరించిన అహింసా మార్గమే ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. చౌటుప్పల్ పట్టణంలో ఆదివారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ మండల కమిటీల సమావేశం జరిగింది. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రతినిధులు చేనేత వస్త్రాలను వినియోగించాలని, సహజ వనరులను సంరక్షించుకోవాలని, సత్యం, అహింసా మార్గంలో నడుచుకోవాలని, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలని, పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలను విరివిగా నాటాలని కోరుతూ మహిళా ప్రతినిధులు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు మాట్లాడుతూ, గాంధీజీ బోధించిన సిద్ధాంతాలను ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేస్తున్న గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ కమిటీని ఆయన అభినందించారు. ఈ కమిటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని, ప్రజల్లో శాంతి, సామరస్యాలను పెంపొందించాలని ఆయన అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యానాల ప్రభాకర్ రెడ్డి, ట్రస్మ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణారావు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రతినిదులు వి. మంజుల, పోలోజు శ్రీలత, బి. సంధ్య, రాధిక, శోభారాణి, నీరజ, జయశ్రీ, శ్రావణి, ఝాన్సి, రాణి, శారద, భవానీ ,రేవతి, స్వప్న, సువర్ణ లక్ష్మి, మంజు, మమత, పుష్ప, కీర్తన, జయ, రూప పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తా


పోచంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న తడక రమేష్

భూదాన్‌పోచంపల్లి, జూన్ 16: పోచంపల్లి అర్బన్ బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానని, తన ప్యానల్ అభ్యర్థులందరినీ గెలిపించాల్సిందిగా చేనేత నాయకులు, చైర్మన్ అభ్యర్థి తడక రమేష్ కోరుతూ ఆదివారం భూదాన్‌పోచంపల్లి పట్టణంలో ప్రచారం ప్రారంభించారు. స్థానిక మార్కండేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవ కుమార్, స్థానిక నాయకులు డాక్టర్ సీత సత్యనారాయణ, రాపోలు శ్రీనివాస్, ప్యానల్ అభ్యర్థులు కొండమడుగు ఎల్లస్వామి, మహిళా అభ్యర్థి కర్నాటి భార్గవి, జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఏలె హరిశంకర్, కొండరి వెంకటేష్, రాపోలు వేణు పాల్గొన్నారు.

పెద్దతండాలో ఉచిత వైద్య శిబిరం

తుర్కపల్లి, జూన్ 16: తుర్కపల్లి మండలం పెద్ద తండ గ్రామంలో ఆదివారం ఆర్‌కే హాస్పటల్, చావా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గిరిజన ప్రజలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 150 మందికి పైగా బీపీ, షుగర్, ఎముకులకు సంబంధించిన బీఎండీ పరీక్షలు నిర్వహించి వాటికి సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ భూక్య బాబునాయక్, ఆర్‌కే ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవలకు ప్రతిరూపం వాసవీ క్లబ్

● క్లబ్ ప్రతినిధులు గంప శ్రీనివాస్, ఓరుగంటి పరమేశ్

భువనగిరి టౌన్, జూన్16: వాసవి క్లబ్ సేవలకు ప్రతిరూపమని ఆ క్లబ్ ప్రతినిదులు గంప శ్రీనివాస్, ఓరుగంటి పరమేశ్, రీజినల్ చైర్మన్ మంచాల ప్రభాకర్ అన్నారు. ఆదివారం భువనగిరిలో నిర్వహించిన వాసవీ క్లబ్ డాన్ టూ డస్క్‌లో వారు మాట్లాడారు. సమాజ ఉన్నతికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. నేత్రదానంపై అవగాహన కల్పించి సభ్యులతో నేత్రదాన పత్రాలపై సంతకాలు చేయించారు. వీధి వ్యాపారులకు గొడుగులు, విద్యార్థులు బోధనా సామగ్రి, దేవాలయం ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ట్యాంకులు, బాటిల్స్ ట్రాఫిక్ పోలీసులకు మాస్కులు, టవల్స్ అందచేశారు. వాసవీ మాత ఆలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రమేశ్, బిజ్జాల మహేశ్, కటకం కృష్ణ, మంచాల రుషికేష్, మంచికంటి రవి, బచ్చు అశోక్, జంగాల హనుమంత రావు, జనార్ధన్ పాల్గొన్నారు.

బక్రీద్ ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు

చౌటుప్పల్ టౌన్, జూన్ 16: చౌటుప్పల్ పట్టణంలో సోమవారం జరిగే బక్రీద్ పండుగ కోసం ఈద్గాతో పాటు నాలుగు మసీదుల్లో నిర్వహించే ముస్లింల ప్రత్యేక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేశారు. సుమారు 4 వేల మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొననున్నారు. విశాలమైన ఈద్గా ప్రాంతంలో మొక్కలను పెంచుతున్నారు. ప్రార్థనల సమయంలో మొక్కలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున ప్రత్యేక ప్రార్థనలను స్థానిక మసీదుల్లోకి మార్చారు. పరిశ్రమల్లో పని చేసే సుమారు వెయ్యి మంది ముస్లీం కార్మికులు ఈద్గా వద్ద ఉన్న పార్కింగ్ స్థలంలో ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మొక్కలకు నష్టం కలగకుండా ఉండేందుకు పార్కింగ్ స్థలంతో పాటు స్థానిక మసీదుల్లో ప్రార్థనలను చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఈద్గా అధ్యక్షుడు ఎండి.బాబాషరీఫ్ తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల కోలాహలం

● స్వామివారి నిత్యాదాయం రూ.89.65లక్షలు


కొండపై ఉత్తర దిశలో షెడ్డు కింద సేద తీరుతున్న భక్తులు

భువనగిరి అర్బన్, జూన్ 16: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి దర్శనార్థం వచ్చిన భక్తులతో ఆదివారం దివ్యక్షేత్రం కోలాహలంగా మారింది. రెండో శనివారం, ఆదివారం, సోమవారం (బక్రీద్) వరుస సెలవులు కలిసిరావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా, సుమారు 60వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా, ప్రత్యేక దర్శనానికి గంట, ధర్మదర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఉభయ క్యూలైన్లల్లు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తజనులతో కోలాహలంగా మారాయి. దీంతోపాటు కల్యాణ, వ్రత మండపాలు, ఆలయ తిరువీధుల్లో రద్దీ నెలకొనగా, ప్రధానాలయం, ప్రసాద విక్రయశాలల్లో మెట్ల దారిలో భక్తులు కిటకిటలాడారు. ఆలయ ఉత్తర దిశలో ఏర్పాటు చేసిన షెడ్డు కింద, అదేవిధంగా మెట్లమార్గంలో భక్తులు అధిక సంఖ్యలో సేద తీరారు. కొండపైన బస్టాండ్‌లో ఆలయ అధికారులు వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయడంతో బస్సు ఎక్కాలంటే తీవ్ర ఆటంకం కలిగింది. భక్తుల రద్దీలో పోటీ పడి బస్సు ఎక్కారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 89,65,064 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అనుబంధ పాతగుట్ట లక్ష్మీనృసింహులకు నిత్యపూజలు వైభవంగా కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. కాగా, ఈ నెల 18న స్వామి వారి స్వాతి నక్షత్రం రోజున 5వేల మంది గిరిప్రదక్షిణలో పాల్గొననున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన కొండ చుట్టూ రోడ్డును ఆలయ అధికారులు కాలినడకన తిరిగి పరిశీలించారు. సుమారు రెండు కిలో మీటర్ల దారి పొడవున రోడ్డు నిర్మాణం గడువులోగా పూర్తి చేసేందుకు పనులు కొనసాగుతున్నాయి. కాలినడకన వెళ్లాల్సిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మరిన్ని అవసరమైన చర్యలు చేపట్టాలని ఈవో భాస్కర్‌రావు సూచించారు. ఆయన వెంట వైటీడీఏ ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డి, డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈవో గజ్వేల్లి రఘు, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరి, తదితరులు ఉన్నారు.

భక్తిభావం పెంచేందుకు గిరిప్రదక్షిణ : ఈవో భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం రోజున నిర్వహించు గిరిప్రదక్షిణలో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. కొండపై ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న చేపట్టబోవు గిరిప్రదక్షిణ కార్యక్రమం ఉదయం 5గంటలకు ప్రారంభమగునని తెలిపారు. వైకుంఠ ద్వారం వద్ద ప్రారంభమై తిరిగి ఇక్కడే ప్రదక్షిణ ముగుస్తోందన్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో ఉద్యోగ సిబ్బంది, వర్తక సంఘం, స్థానిక భక్తులు, ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నాలన్నారు. గిరిప్రదక్షిణ చేయడం మూలంగా దుష్ట, వ్యాధి గ్రహ, ప్రయోగ బాధ నివారణ, గ్రహదోష నివారణ, సంతాన, వివాహ భాగ్యం, ఇతర కోరికలతో ఓం శ్రీ లక్ష్మీ నరసింహాయ నమః అను నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తారో స్వామివారి అనుగ్రహంతో సమస్త కోరికలు నెరవేరునని, తద్వారా గిరిప్రదక్షిణ ఫలం పొంది స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వెల్లడించారు. సుమారు ఐదు వేలమంది పాల్గొనేందుకు రోడ్డు మార్గంలో మరమ్మత్తులు చేపట్టగా ఆదివారం పరిశీలించారు.